**E-ISSN:** 2583-9667
**Indexed Journal**
**Peer Reviewed Journal**
https://multiresearchjournal.theviews.in

**Received: 15-04-2023**
**Accepted: 23-05-2023**
**Published: 10-07-2023**

**INTERNATIONAL JOURNAL OF ADVANCE RESEARCH IN MULTIDISCIPLINARY**

**Volume 1; Issue 1; 2023; Page No. 1007-1009**

# కవిలోపలి భూమండలం దండకడియం

**డా.బెల్లి యాదయ్య**

తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట, తెలంగాణ, భారతదేశం

**DOI:** https://doi.org/10.5281/zenodo.17312335

**Introduction**

"One big part of writing my poetry is realizing and recognizing that I have been dwelling on issues or challenges in my life before writing them "

-- Victoria Hurtado

సూర్యుడికి సూర్యమండలం ఉన్నట్టు చంద్రుడికి చంద్రమండలం ఉన్నట్టు కవికీ ఓ మండలం ఉంటుంది.సూటిగా చెప్పాల్సి వస్తే భూమండలమే కవి స్థావరం. అందుకే కవి మాట్లాడుతూ వుంటే అతని బువ్వ ,అతని బట్ట,అతని బ్రతుకుని పెనవేసుకున్న చెట్టూచేమా,పువ్వూపుట్రా,శ్రమ, శమనం కవిత్వ పర్యావరణంగా ప్రసక్తమవుతాయి.కవిత్వంలో సూర్యచంద్రుల ప్రస్తావన ఉన్నా కూడా అది కాల్పనికంగా లేదా స్థలేతరంగా ఉంటుంది.కారణం అవి బాహిరమైన విషయాలు.బాహిరమైన అంశాలు ఎంత మహత్తరమైనవైనా అవి కేవలం అలంకారాలుగానే అమరుతాయి కవిత్వానికి. భూమి అట్లా కాదు,కవి లోపల ఉండి,కవిలోపలి నుండి అంతర్లీనంగా గృహస్థంగా ఆత్మాశ్రయమైపోయి మనిషి రూపందాల్చి మాట్లాడుతుంది.అందుకే భూమి గొంతు వినాలకున్న వాళ్లకు, భూమి భాష తెలుసుకోవాలనుకున్న వాళ్లకు,భూమి గుండెచప్పుడును దిటవును వినాలనుకున్న వాళ్లకు కవిత్వం స్థలబంధువు.అంటే కవికి లోకల్ మరియు నేటివ్ అయిన భూమి, కవితాస్వాదన తర్వాత పాఠకులకూ అంతే లోకల్,అంతే నేటివ్ అయిపోతుంది. కవి నడిచిన చోటుకల్లా పాఠకులు నడుస్తారు.కవి పంచుతున్న బాధనూ అనుభూతినీ పాఠకులు పంచుకుంటారు.కవి భుజాలకెత్తకున్న బాధ్యతనంతా పాఠకులు సైతం మోస్తారు.కవి సామాజికమై పోతాడు.కవిత్వం కవిజీవితమే అయినప్పటికీ సమస్త ప్రజల జీవితమై ప్రతిబింబిస్తుంది.అట్లా ప్రతిబింబించే కవిత్వానికే సార్వజనీనత సిద్ధిస్తుంది. స్థానికతను జీవం చేసుకొని,బతుకును స్థావరం చేసుకొని,సార్వజనీనతా మార్గంలో కవిత్వం రాస్తున్న ఇప్పటి కొత్తతరం సబాల్ట్రన్ కవుల్లో ఆణిముత్యంలాంటి యువకవి తగుళ్ల గోపాల్.కవి సంగమం ప్రచురణ ద్వారా ఈయన వెలువరించిన 'దండ కడియం' కవితా సంపుటి గోవర్ధన గిరిలా ఓ సబాల్ట్రన్ ఎత్తిపట్టుకున్న భూమండలంతో మనం పోల్చకోవచ్చు.రంగినేని ఎల్లమ్మ' పురస్కారంతోపాటు,కేంద్రసాహిత్య యువపురస్కారం కూడా అందుకున్న తగుళ్ల గోపాల్ అత్యంత పిన్నవయస్కుడు కావడం మరీ విశేషం.

వస్తు నవ్యత,రూపనవ్యతే కాకుండా కవికి అనుభవ జ్ఞానం గురించిన గాఢమైన అవగాహన ఉండాలి. అనుభవ జ్ఞానం నుండి ప్రవహించే కవిత్వం మానసిక మెలుకువను కలిగిస్తుంది. కవిత్వంలో మనోజాగరూకత అనుభవ సంభావ్యతల సమ్మేళనం భావోద్వేగాలను రగిలించేదిగా ప్రభావితం చేసేదిగా తాదాత్మ్యాన్ని ప్రసాదించేదిగా ఉంటుంది.అప్పుడే అది మంచి కవిత్వం. మంచి కవిత్వంగా ఉదాహరించదగిన 'దండకడియం' కవితా సంపుటిలో మొత్తం యాభై ఆరు కవితలున్నాయి. 'బతుకును ప్రేమించడం నేర్పిన ఈ కవిత్వాన్ని, గదువ పట్టుకొని నన్ను ఓదార్చిన ఈ దండ కడియాన్ని మీ చేతుల్లో పెడుతున్న' అంటున్న తగుళ్ల గోపాల్ తాను కవిత్వాన్ని ఎంత ప్రాణప్రదంగా చూసుకుంటాడో ఈ వాక్యాన్నిబట్టే తెలుస్తుంది. ఇందులోని

రెండో కవిత 'ఒకే ఆకాశాన్ని కప్పుకున్నవాళ్లం'.ఇది సంపుటికి తలమానికమైన కవిత.తగుళ్ల గోపాల్ కవిగా ఎటువైపున్నాడో చెప్పే కవిత కూడా. ఒక అనాథ వృద్ధురాలి పట్ల అపారమైన కరుణను వ్యక్తం చేసే అత్యద్భుతమైన కవిత ఇది.

"ఉదయమో,మధ్యాహ్నమో,
సాయంత్రమో ఆమెను చూడకపోతే
ఆ రోజంతా సూర్యుడు ఉదయించనట్లు"
అంటూ ఆరంభమై
"మా మధ్య ఏ బంధుత్వం లేకపోయినా
ఆమె నన్ను నాయనా అంటది
నేను ఆమెను అమ్మా అంట
ఒకే ఆకాశాన్ని కప్పుకున్నం
ఒకే మట్టిని కప్పుకోవాల్సిన వాళ్లం
ఇది చాలదా?

మేం బంధువులం కావడానికి." అంటూ ముగిసే ఈ కవిత మనిషికి మరో మనిషికి గల పాంచభౌతిక సంబంధంలోని ఔన్నత్యాన్ని empathetic గా వివరిస్తుంది. "Love and compassion are necessities, not luxuries. Without them, humanity cannot survive."అంటారు దలైలామా ఓ సందర్భంలో. సరిగ్గా దలైలామా మాటలకు అక్షర రూపం 'ఒకే ఆకాశాన్ని కప్పుకునేవాళ్లం'కవిత. సమస్య కాదు, రచన పరిష్కారం ఇవ్వాలి అని కదా కవులపైన విమర్శ. జీవితం తెరిపిలేని కన్నీటి కెరటాలమయమైన మనుషులకు మంచి ఓదార్పు 'దుఃఖపు గంప'కవిత.వోల్టేరు మహానుభావుడి -"Tears are the silent language of grief" అనే వ్యాఖ్యకు ప్రతిరూపం 'దుఃఖపు గంప' కవిత. చెరువును ఇంటి ఆడబిడ్డ గా వర్ణించే 'చెరువుగట్టు మీద',కవి తన తండ్రిని గుర్తుకు చేసుకునే 'నాన్న గుర్తొచ్చినప్పుడల్లా'కవిత,పేదరికాన్ని జయించడానికి ఆసరా అయిన 'గంజి',తెలంగాణ పల్లీయ సౌందర్యాన్ని బతుకమ్మను దేదీప్యమానం చేసే 'ఎర్రమన్ను తట్ట', కాలీన దృశ్యాలను కవిసమయాలుగా ఇముడ్చుకున్న 'వాళ్ల రంగులద్దిన వాక్యాలు',సబాల్టర్న్ జీవితాల చెమట చరిత్ర నుండి historical Impulse ను ద్విగుణీకృతం చేసే'కూలితల్లి'కవితలు తగుళ్ల గోపాల్ కు గల capacity of ideation కు,కవిగా తనను తాను కవిత్వంలోకి transmutation చేసుకొనే తీరుకు నిదర్శనాలు.
సుప్రసిద్ధ మళయాళ రచయిత విమర్శకులు ప్రొ.కె. సచ్చిదానందన్ సబాల్టర్న్ సాహిత్యాన్ని గురించి 'Mainstreaming subaltern' అనే వ్యాసంలో " సబాల్టర్న్ సాహిత్యం సాహిత్య పటాన్ని తిరగరాయడం ద్వారా తనదైన స్వంత ప్రత్యామ్నాయ సౌందర్యాన్ని సృష్టించింది" అంటారు. ఈ పరిచర్యకు సంబంధించిన ఉత్తమ కావ్యమే దండకడియం.

"సుట్టమై మా ఊరికి
ఎప్పుడైన బోనాలపండుగకు రండ్రి" అంటూ
ఊరు దృశ్యాన్ని చూపించే 'జొన్నరొట్టె కమ్మదనంలోంచి'కవిత సచ్చిదానందన్ మాటలకు నిండు సాక్ష్యం.'గుంతగిన్నె' ఓ అద్భుతమైన
పాత్రా స్మృతి కవిత.
" పండుగ పూట సున్నమేసి సున్నమేసి
చేతులు బుక్కినయి
గిన్నె తెచ్చుకోవే ఎల్లి...పరమాన్నం బెడతా అని
పుష్పమ్మ పటేలమ్మ అంటుంటే
అమ్మతో పాటే ఉరికి
గుండెనిండా బెల్లబువ్వను నింపుకొని

దసరా పండుగను మా ఇంటికి తీసుకొచ్చేది" అంటూ గుంతగిన్నె స్మృతిని గోపాల్ వర్ణిస్తున్నప్పుడు మనకు సుప్రసిద్ధ సాహిత్యవేత్త Amitabha Bagchi మాటలు " Hatred is created by sucking poetry out of our lives. By bringing poetry back to life, we can bring back the love and togetherness that poets have given us over centuries". గుర్తుకొస్తాయి. 'ఆల్బమ్' కవిత ఒక జ్ఞాపకాలకు నిఘంటువు. ఎరుకల లింగమ్మ కథ మీదుగా సామాజిక అంతరాలను

"ఎరుకోయమ్మ ఎరుకనీ
రేపటికాలాన్ని
కళ్లముందుజూపే తల్లీ...
కులమతాల బురదగుంటలోంచి
ఈ లోకం ఎప్పుడు
బయటపడుతుందో జారీ
ఎరుకజెయి"

అని ప్రశ్నించిన కవిత 'చియ్యకూరల పాట'.పాడి పంటలకు పర్యాయపదమైన పల్లెలకు అక్కడి మహిళలు మాతృమూర్తులే ధమనులు సిరలు.ఆ తల్లులు నోటివెంట జాలువారే జానపదాలు లోకానికి జ్ఞానపథాలు.చెలిమలతో చేన్లతో పెనవేసుకొని ఊపిరిగా మారిన శ్రమ నుంచి,దంపుడు నుంచి దాంపత్యం నుంచి ,కోత నుంచి మోత నుంచి,జనన మరణాల నుంచి,ఎగుడుదిగుడుల ఇకమతిని కనిపెట్టి ఎత్తుకునే ఎల్లమ్మ బోనాల నుంచి,జమిడికె

డుడుకుడుడుకుల నుంచి, జమ్మి నుంచి జాగృతి నుంచి జగతి గతిని చాటే సమ్మోహన రాగాలు ఊళ్ళల్లో అమ్మలు పాడే పదాలు. వీటి అక్షర రూపమే

**'బువ్వచేతికొంగు' కవిత. అంతేకాదు,కవి తన తల్లి ఎల్లమ్మకు పట్టిన-**

"కాంటాలు చిమ్మెటలు పేలాడే
పసుపుతాడు
ముక్కు పుల్ల లేని నిండుముఖం
బువ్వచేతికొంగు ఏసుకునే అమ్మ
ఒక నిరలంకార పద్యం
పొద్దుటి నుంచి పొద్దుగుందాక
మెదమోసి,వడ్లుదులిపి
కుండెడు వడ్లను నెత్తిన బెట్టుకొని
పచ్చినొప్పులతో ఇంటికిజేరే

మా అమ్మనే ఒక జానపద పాట" నిండైన కవితా నీరాజనం. ఈ కవిత చదివితే కవులకు రచయితలకు తమ తల్లులు ఏమిస్తారో ఎలా ప్రభావితం చేస్తారో తెలుస్తుంది. తమిళ సంస్కరణవాద కవి, రచయిత పెరుమాళ్ మురుగన్ చెప్పిన "My mother was illiterate. But it was her behaviour-her words and actions - that formed me. It was she who took me out of a narrow world. She did not naturally. Her contribution to my writing has been strong." అనే మహదభిప్రాయమే బువ్వచేతికొంగు కవిత.

కవితల ఎత్తుగడ, నడిపించడంలో ముగింపుల్లో గోపాల్ పాటించే harvest of taste పాదపాదాన మనల్ని కట్టిపడేస్తుంది.పల్లెల నుంచి వచ్చిన కవులు తనకు ముందు తరాల్లో

అనేకమంది కవిత్వంలో ఉన్నా, వాళ్లెవరూ రాయనంత బాగా రాయడం చూస్తే,ఇంకా వెనుకటి పల్లెలోంచి ప్రపంచీకరణకు ముందు ఆరుఏడు దశకాల్లోని ( ఆయన భాషలోనే మనుషులు పల్చబడని) పల్లెనుంచే కనుక గోపాల్ వచ్చివుంటే ఈ కవితలు ఇంకెంత బలీయంగా నాస్టాలజీకి పురుడు పోసేవో. నిర్మించు, నిర్దేశించు, అందించు (design, directive, deliver) ఇరవై ఒకటో శతాబ్దపు ఉత్పాదకతా నినాదాలు. వీటినే ఇవాళ్టి కొత్త తరం కవులు సాహిత్యంలో ప్రతిక్షేపిస్తున్నారు.అయితే Brigham Young University ఆచార్యులు అష్లీ వాల్టన్ చెప్పినట్టు "Contemporary writers often consciously draw inspiration and ideas from the writers who have come before them" .అక్కడితోనే ఆగిపోకుండా

కొత్తతరం కవులు సబాల్టర్న్ వాదాన్ని ప్రధాన స్రవంతి సాహిత్యంగా మార్చేసే పనిలో ఉన్నారని తగుళ్ల గోపాల్ రుజువుచేస్తున్నాడు. ప్రధానంగా ఇరవైఒకటో శతాబ్దపు కవిది అస్తిత్వ సంవేదన.

ఈ సంవేదనలో భాగంగానే చరిత్రలోకి,స్మృతిలోకి, జ్ఞాపకాల్లోకి కవి వెళ్తాడు.దండకడియంలో ఈ తరహా కవితలు అనేకం. Canonical form కాకుండా independent form లేదా contemporary form ను ఈ శతాబ్దపు కవులు సాధించుకున్నారు. సాహిత్యంలో ఉండే 18 రకాల స్వరాల్లో నూతన శతాబ్దపు కవి assertive and nostalgic tones ను వాడతాడు. గోపాల్ ఈ టోన్లనే వాడుకుంటున్నాడు.'The light of knowledge' గ్రంథంలో ఫ్రాన్సిస్ కోడీ దక్షిణ భారతీయ కవులు రచయితలు ఆధునికతలో భాగంగా మొదట Reason and Belief గురించి, ఆ తర్వాత Culture and Identity గురించి రాస్తే, వర్తమాన కవులు Expertise and Epistemology గురించి రాస్తున్నారంటారు. సరిగ్గా చెప్పాలంటే తగుళ్ల గోపాల్ సబాల్టర్న్ ప్రావీణ్యాలకు, జ్ఞాన మీమాంసకు అక్షర రూపం ఇస్తున్నాడు. తన జీవన తిర్యగ్రేఖనూ బతుకు దిజ్మండలాన్ని శివారెడ్డిగారన్నట్టు most native గా నిలబడి కవిత్వం చెబుతున్నాడు. Established form లో స్థిరపడ్డ కవులు bitter గా, biased గా, militant గా, angry గా భావించిన నిమ్నజీవితాల భగ్నజీవితాల బడబాగ్నిని కడు మాధుర్యంగా, rhythmic speech గా తగుళ్ల గోపాల్ గొంతున మోస్తున్నాడు. Our great writers wanted to destroy, to edify, to demonstrate" అంటాడు జీన్ పాల్ సార్త్రే. ఈ పనికి గోపాల్ కంకణబద్ధుడైనాడు. బహుశా..గొర్ల

మందను మల్లేస్తే వచ్చేశక్తిసామర్థ్యాలివే.వోల్టేర్ అన్నట్టు " కన్నీళ్లు శోకం యొక్క భాష" .దండకడియం కూడా శోకం యొక్క బ్లూప్రింట్. సొంతం చదివాకగానీ మనకు అర్థం కాదు. షేక్స్పియర్ మహానుభావుడు చెప్పినట్టు ఈ నవకవి కూడా " I 'call for pen and ink and write my mind" అంటున్నాడు. ముప్పెయ్యో పడిలో విశిష్ట పురస్కారాలెన్నో అందుకునేలా తగుళ్లగోపాల్ ను ఎదిగించిన కలకొండ ఊరి మట్టికి,పాలమూరు జిల్లాకు జేజేలు.అన్నింటినీ మించి మందెంటబోయేటి గోపాల్ ను చేరదీసి బడిలో సాకిన రాజవర్ధన రెడ్డికి కవితా సుమాంజలి.

**Creative Commons (CC) License**
This article is an open access article distributed under the terms and conditions of the Creative Commons Attribution (CC BY 4.0) license. This license permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.